www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 ఏప్రిల్ 2025
5
చిత్తూరు

వాహన వైద్యసేవలు బంద్

- ఏజెన్సీతో ముగిసిన ఒప్పందం
- పశువైద్యశాలలకు పరిమితమైన సిబ్బంది
- అవస్థలు పడుతున్న పాడి రైతులు

ఆపదలో ఉన్న వ్యక్తుల కోసం '108' ద్వారా వైద్యసేవలందించిన తరహాలోనే రోగాలు, ప్రమాదాల్లో గాయపడిన మూగజీవాలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు వైద్యసేవ పేరిట సేవలను 2022 మే 19వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించింది. నాటి నుండీ రాష్ట్రంలో 175 సంచార పశువైద్య వాహనాలు సేవలందిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజవర్గానికి రెండు పశు వైద్య సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. తమ పశువులు జబ్బుల భారిన పడ్డాయంటూ టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు ఫోన్ చేసిన వెంటనే సమీపంలోని సంచార పశువైద్య సిబ్బంది చేరుకొని సేవలు అందించేంవి...

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
పశువులకు జబ్బులు, ఇతర వ్యాధులు సోకిన సమయంలో సుదూర ప్రాంతాల్లోని పశు వైద్యశాలలకు తీసుకుపోకుండా ఇంటి వద్దకే పశువైద్యులు వచ్చి సేవలందించాలనేది సంచార పశువైద్య వాహనాల ఏర్పాటు ఉద్దేశం. ఈ వాహనంలో పశువైద్యులు, వైద్యపరీక్షల కోసం ల్యాబ్ ఉంటుంది. ఒక్కో వాహనంలో ఒక వైద్యుడు, పారామెడికల్ సిబ్బంది, డ్రైవర్ ఉంటారు. సంచార పశు వైద్యసేవలు పొందడానికి 1962 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. రైతులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే వారి ఇంటి వద్దకే వచ్చి పశువులకు వైద్యసేవలు అందిస్తారు. ఈ సంచార వాహనంలోనే ల్యాబ్ కూడా ఉంటుంది. వైద్యంతో పాటు మందులూ ఉచితంగానే సమకూరుస్తున్నారు. అంబులేటరీలో వైద్యసేవలు అందించడానికి జీవీకే సంస్థ వైద్యులను నియమించింది.

ఇలా ఏర్పాటు చేసిన పశు సంచార వాహనాల్లో పశువులకు అసరమైయే మందులు, పశువైద్య సిబ్బంది వేతనాలు ఏజేన్సీ చెల్లించేంది. ఏజేన్సీ ఒప్పందం ముగియడంతో చిత్తూరు జిల్లాలో పశువైద్య వాహనసేవలు ఆగిపోయాయి. కొత్త ఏజేన్సీ ఏర్పాటు చేయకపోవడంతో గత నెలరోజులుగా ఆయా ప్రాంతాల్లోని పశు వైద్యశాలలకు పశువైద్య సంచార వాహనాలు పరిమితమైయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో భారీ సంఖ్యలో పాడి ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఇందులో నాలుగు లక్షలకు పైగా పాడిఆవులున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న మూగజీవాలకు సంచార వైద్యసేవ పేరిట అందించే వైద్యం ఒక్కసారిగా ఆగిపోవడంతో జిల్లాలోని పాడిరైతులు, గొర్రెలు, మేకల పోషకులు చిన్న వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుండీ పశువైద్యశాలకు తీసుకుపోవాల్సి వస్తోంది. చిత్తూరు జిల్లాలో 16లక్షల లీటర్ల పాలదిగుబడి వస్తోంది. దీన్ని 18 లక్షల లీటర్లు పెంచాలనేది లక్ష్యం. పశు వైద్య సంచార వాహన సేవలు అగిపోవడంతో పాల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశమున్నట్లు పాడిరైతులు భావిస్తున్నారు. అలాగే గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల నివారణ కోసం పశువైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రభుత్వం తిరిగీ సంచార పశువైద్య సేవలను ప్రారంభించాలని కోరుతున్నారు.

94.61 శాతం పింఛన్లు పంపిణీ

పలమనేరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రారంభమైంది. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 63,27,116 ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారులు ఉన్నారు. మంగళవారం రాత్రి 8:30 గంటల వరకు 60,04,365 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలియజేశారు. మిగిలిన వారికి బుధవారం ఉదయం నుండి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి పంచాయతీ నెల్లేపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గప్రసాద్, వీఆర్వో లోకనాథం, వెల్ఫేర్ అసిస్టెంట్ హైమవతి, మహిళా పోలీస్ మౌనిక, హార్టికల్చర్ ఏవో కవిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సునీల్, డిజిటల్ అసిస్టెంట్ చిన్నబ్బ పాల్గొన్నారు.


రొంపిచెర్లలో..

రొంపిచర్ల: పులిచెర్ల ఎంపీడీవో రాజశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులుమండలంలో మంగళవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పంపిణీ చేశారు. రొంపిచర్ల మండలం పెద్దగొట్టిగల్లు గ్రామంలో ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ పాల్గొన్నారు.

95శాతం పంపిణీ పూర్తి: కమిషనర్
పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని అన్నీ వార్డు సచివాలయ సెక్రెటరీలు ద్వారా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు మంగళవారం ఉదయం నుండి లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ అందజేసినట్లు కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి తెలిపారు. మొత్తం పెన్షన్లు 4524కు గాను 4313 మంది లబ్దిదారులకు 95.34శాతంతో పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు.


గంగాధర నెల్లూరులో..

మెప్మా సభ్యులకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్

అభినందించిన ఎమ్మెల్యే అమరనాథ్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని మెప్మా సభ్యులు ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్ ఫాం ద్వారా మార్చి 8వ తేదీ నాటికి 1,13,000పై చిలుకు కొనుగోలు చేసిన సందర్భంగా వారు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సాధించారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మంగళవారం వారిని అభినందిస్తూ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి, మెప్మా సిఎంఎం బాబా, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆఫీసులో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్‌లోని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా బుధవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరణ జరుగుతుందని తెలిపారు.

సమసమాజ స్థాపనకు ఉపాధ్యాయులు కీలక

ఎంఈఓ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సమసమాజ స్థాపనకు ఉపాధ్యాయులే కీలకమని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యావనరుల కార్యాలయంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లీలావతిమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారు ఎంతో మంది విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దారని, ఆ కోవలోనే ఉపాధ్యాయురాలు లీలావతిమ్మ గత 36 సంవత్సరంలుగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టి విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడ్డారని అన్నారు. అనంతరం ఆమెను శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీపతి, జగదీశ్వర్, మహేష్ బాబు, సిఆర్‌పిలు సుశీల, ప్రేమలత, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పాలీసెట్ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- కుప్పం టౌన్
పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాయదలిచిన విద్యార్థులకు తమ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కుప్పం పట్టణంలోని డాక్టర్ వైసి జేమ్స్‌ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు త్వరితగతిన ఉపాధి పొందవచ్చని తెలిపారు. పదవ తరగతి పరీక్ష రాసిన వారు, పాస్ అయిన వారు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయడానికి అర్హులని, ఉత్సాహవంతులు ఈనెల 15వ తేదీ లోపున పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయడానికి అర్జీ చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ చేయదలచుకున్న వారు పదవ తరగతి హాల్ టికెట్, ఓటిపి నమోదుకు, ఆన్లైన్ ద్వారా ప్రవేశ పరీక్షా రుసుం చెల్లించడానికి అణువుగా సెల్ఫోన్, పాస్పోర్ట్ సైజు కలర్ ఫోటో తీసుకురావాలని సూచించారు. అర్జీ చేసుకోవడానికి తమ కళాశాల తరపున సహకారం అందిస్తామన్నారు. అలాగే పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తామని, ఈనెల 3వ తేదీ నుండి శిక్షణా కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. శిక్షణ తరగతులకు వచ్చే విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు అర్జీ చేసుకున్న రసీదు, పదవ తరగతి భౌతిక, రసాయన, గణిత శాస్త్రాల పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు తీసుకురావాలని సూచించారు. ఉచిత శిక్షణతో పాటు శిక్షణకు అవసరమైన పాఠ్యపుస్తకాలను సైతం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీవో నెంబర్ 117 రద్దు చేసి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భక్తీలను వెంటనే నియామకం చేయాలని, తదితర డిమాండ్లతో ఈనెల 2వ తేదీ బుధవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట జరిగే ఫ్యాప్టో నిరసన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్.మణిగండన్, సెక్రటరీ జనరల్ జి.మునీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్, సెక్రటరీ మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వలన రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొన్నదన్నారు. గత ప్రభుత్వం కాలయాపన చేసిన దరిమిలా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఆ ప్రభుత్వ వైఖరిని నిరసించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయి తొమ్మిది నెలలు గడచినా ఆ ఊసే లేదని, నిత్యం పెరుగుచున్న ధరలకనుగుణంగా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, జీవో నెంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చిత్తూరు ఉపవిద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సంతాపం తెలియజేస్తూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జి.చంగల్రాయ మందడి, గంటా మోహన్, జివి.రమణ, ఎన్ఆర్.మదనమోహన్ రెడ్డి, ముక్తార్ అహ్మద్, ఎస్పీ బాషా, దామోదరం పాల్గొన్నారు.

తెలంగాణ సిపిఎం బృందానికి స్వాగతం పలికిన జిల్లా నాయకులు

రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సిపిఎం ఆలిండియా మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు రాష్ట్ర నాయకత్వానికి చిత్తూరు రైల్వేస్టేషన్లో జిల్లా సిపిఎం స్వాగతం పలికి భోజన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం మధురైలో మహాసభలో జరుగుతున్నాయని ఈ మహాసభల్లో ప్రజాసమస్యలపై పోరాటాలతోపాటు దేశంలో బలపడుతున్న మతోన్మాద ప్రమాదాన్ని అరికట్టడానికి తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాలకు కార్యాచరణ నిర్ణయించి సొంతంగా సిపిఎం బలపడడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు ఉద్యమ నాయకులు 30మంది ప్రతినిధులు ఆల్ ఇండియా మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. మార్గమధ్యంలో చిత్తూరు రైల్వేస్టేషన్లో వారికి స్వాగతం పలికి వారికి భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ తనతోపాటు రాష్ట్ర నాయకత్వం వీరయ్య, సాగర్, బండారు రవికుమార్, మరో 30 మంది హాజరవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్ గుప్తా, బాలసుబ్రమణ్యం, దాము,రాజా, లోకనాథం పాల్గొన్నారు.

ఫీజులు కట్టేదీ మేమే.. బస్సు తోసేది మేమే..!

- వేలకు వేలు ఫీజులు కట్టినా స్కూలు బస్సు కదలాలంటే విద్యార్థులు చెయ్యి వెయ్యాల్సిందే ..!
- బస్సుల నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసిన అధికారులు
- పిల్లలు తిరిగి వచ్చేవరకు ఆందోళనలో తల్లిదండ్రులు
- పాఠశాల యాజమాన్యం వచ్చే విద్యా సంవత్సరానికైనా బస్సుల మరమ్మతులు చేపట్టాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల యజమాన్యాలు ఒక్కో విద్యా సంవత్సరానికి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలల్లో ఫీజులు వసూళ్లు చేస్తుంటాయి. ఇందులో బస్సు ఫీజు అదనం. ఒక్కో స్కూలు ఒక్కోలా ఏడాదికి రూ.12 నుంచి, రూ.14 వేల వరకు విద్యార్థుల నుంచి బస్సు ఫీజు గుంజుతున్న పరిస్థితి. ఇక్కడి వరకు ఇలా ఉన్నా, బస్సులను ఫిట్‌గా ఉంచుకోవాలన్న కనీస ధర్మాన్ని ప్రయివేట్ యాజమాన్యాలు పాటించడం లేదు. దీంతో తరచూ మరమ్మతులకు గురవుతూ విద్యార్థులకు చుక్కలు చూపెడుతున్నాయి. దీంతో ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీలకు తమ పిల్లల్ని పంపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు దిన దిన గండంగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే పట్టణంలోని ఓ ప్రముఖ ప్రయివేట్ పాఠశాలకు చెందిన బస్సు పట్టణ నడిబొడ్డులో మంగళవారం అర్థాంతరంగా ఆగిపోయింది. ఒంటిపూట బడి ముగిసిన అనంతరం విద్యార్థులను పిల్లలకు చేరవేసేందుకు బయలుదేరిన బస్సు ఆగిపోవడంతో విద్యార్థులే ఆ బస్సును తోయాల్సి వచ్చింది.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వందకు పైగా ప్రైవేట్ స్కూలు, కాలేజీ బస్సులు నడుస్తున్నాయి. వీటికి సరైన ఫిట్నెస్ లేకపోవడంతో తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికైనా బస్సులు పూర్తిస్థాయి ఫిట్నెస్‌తో నడపాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మహిళా జూనియర్ కళాశాలలో

అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- యాదమరి: కాశిరాళ్ళ హైస్కూల్ ప్లస్ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో బాలికలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం అయిందని కళాశాల ప్రిన్సిపాల్ లలితా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా జూనియర్ కళాశాలలో 2025-26 ఈ విద్యాసంవత్సరంలో ఇంగ్లీష్ మీడియం ఎం.బై.పి.సి గ్రూపులలో ఈనెల 7వ తేదీ సోమవారం నుండి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. కళాశాలలో చేరదలచిన వారు తమను సంప్రదించాలని పేర్కొన్నారు. అధ్యాపకులు దామోదర్ రెడ్డి, వై.మధుసూధన్, సుధాకర్, మహేష్, రాజరాజేశ్వరి, కనకాచారి, మదన్ మోహన్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రిని గెంటేసిన కొడుకు

ఫిర్యాదు చేసిన కృష్ణప్ప

ప్రజాశక్తి- పుంగనూరు: ఉన్న ఆస్తి మొత్తం కొడుకు పేరిట రాసి ఇచ్చి తన జీవనం కోసం కొంత భూమిని ఉంచుకున్నాడు ఓ తండ్రి.. అయితే ఈ భూమిని సైతం తన పేరిట రాయాలంటూ కొడుకు తండ్రి ఇంటి నుంచి గెంటేసిన సంఘటన పుంగనూరులో చోటు చేసుంది. దీంతో ఆ తండ్రి తనకు న్యాయం చేయాలని పలమనేరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయంలో డిఎస్పీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫిర్యాదుల దినం కార్యక్రమంలో సదరు తండ్రి ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు మండలం దిగువచదల్ల గ్రామంలో ఉంటున్న కృష్ణప్పను అతని కుమారుడు దేవరాజు ఇంటి నుంచి గెంటి వేసినట్టు ఫిర్యాదు చేశారు. కృష్ణప్ప పేరు పైన ఉన్న భూమిని గతంలో కోడలి పేరుపై 10 ఎకరాల భూమి రాసిచ్చారు. మిగిలిన రెండున్నర ఎకరాల భూమిని కూడా తనను మోసాగించి విక్రయపత్రంపై కొడుకు దేవరాజు రాయించుకున్నాడని, ఏడాదిగా తనను ఇంటి నుంచి కొడుకుకోడలు గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న రెండున్నర ఎకరాల భూమిని తనకు ఇప్పించాలని డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు మండలం కృష్ణాపురం, దిగువచదల్లలో భూసమస్య, ఉద్యోగం ఇప్పిస్తామని రూ.10వేలు వసూలు చేశారని, అలాగే మేలుపట్లలో చిన్న పాపపై సైకిల్ ఢీకొన్నదని ఫిర్యాదులు అందాయి. వీటిపై వెంటనే పరిష్కారానికి డీఎస్పీ చర్యలు తీసుకున్నారు

17 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17మంది పట్టుబడ్డారని తెలిపారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు 17మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1,70,000లు జరిమానా విధించడం జరిగిందన్నారు. గత సంవత్సరం, ఈ నాలుగు నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 868 మందికి సుమారు రూ.86.8లక్షలు ఫైన్ విధించడం జరిగిందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం దూర విద్యా విభాగం ఆధ్వర్యంలో బుధవారం నుంచి దూరవిద్య పీజీ, యూజీ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఊకా రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 50 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధాన కేంద్రాలుగా 32,650 మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులలో పరీక్షలు రాస్తున్నట్లు వెల్లడించారు. దూరవిద్యా కేంద్ర పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా క్రమశిక్షణతో ప్రశాంతమైన వాతావరణంలో రాయాలని సూచించారు.

క్షణికావేశం..కుటుంబాలు చిన్నాభిన్నం.!

- దంపతుల విభేదాలు, ఆత్మహత్యలు - అనాథలుగా మిగులుతున్న కుటుంబాలు - ఆలోచించి నిర్ణయం తీసుకోవాలంటున్న వైద్య నిపుణుల సలహాలు

నేటి ఆధునిక యుగంలో కుటుంబంలో తలెత్తే చిన్న సమస్యలు, భార్యా భర్తల మధ్య ఏర్పడే భావాలు కారణంగా కొంతమంది దంపతులు విడిపోయి, మరి కొందరు ఆత్మహత్యలు పాల్పడుతుండడంతో వారి కుటుంబాలు ఛిద్రమై వారి బిడ్డలు అనాథలుగా మారుతున్నారు.. పిల్లల ఏకాకిగా మారి అనాథలు తున్నారు. ఇటీవల మండలంలో పలువురు దంపతులు విడిపోవడం, ఆత్మ హత్యలకు పాల్పడడంతో ఇందుకు తార్కాణం.. సమస్యలు తాత్కాలికమేనని, క్షణిక వేశంతో నిర్ణయాలు తీసుకోకుండా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నప్పుడే కుటుంబాలు చిన్నాభిన్నం కాకుండా కాపాడుకోవచ్చని ప్రముఖ సైకాలజి స్టులు పేర్కొంటున్నారు.

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలో 28 పంచాయతీలు వున్నాయి. అన్ని పంచాయతీల్లోనూ ఇటీవల విభేదాలతో క్షణికావేశంతో విడిపోతున్న దంపతులు, ఆత్మహత్యకు పాల్పడుతుండడంతో వారి కుటుంబాలు, పిల్లల బతుకులు వీధిన పడి దిక్కులేని అనాథలుగా మారుతున్నారు.. వాటికి కొన్ని ఉదాహరణలు

వెదురుకుప్పం మండలంలో తిరుమలయ్యపల్లి పంచాయతీ మొరవలో ఓ దంపతులు ఏడాది క్రితం విడి పోయారు. వారి కుటుంబ సభ్యులు పోషించే వారు లేక సమస్యలతో సతమతమవుతున్నారు. మాంబేడు పంచాయ తీ లో ఇద్దరు, దామర కుప్పం, ఇనాం కొత్తూరు దామరకుప్పం పంచాయతీలలో ఇటీవల ఓ జంట విభేదాలతో క్షణికావేశంతో విడిపోయారు. బ్రాహ్మణ పల్లి పంచాయతీ లోనూ విడిపోతుండడంతో జంటను స్థానిక పెద్దలు పంచాయితీ నిర్వహించి కలిపేం దుకు ప్రయత్నించారు. అయితే అది వీలు కాకపోవడంతో ఆ కుటుంబం విచ్ఛిన్నమై పిల్లల బతుకులు వీధిన పడి అనాథలయ్యారు. జిడి నెల్లూరు నియోజక వర్గంలోని ఎస్‌ఆర్‌పురం లోనూ ఓ జంట రెండు రోజుల క్రితం మనస్పర్థలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో ప్రస్తుతం చావు బతుకుల మధ్య ఉన్నారు. జిడి నెల్లూరు మండలంలోనూ కుటుంబ కలహాల కారణంగా ఏడాది క్రితం ఒకే కుటుంబంలో నల్గురు మృతి చెందడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇలా ఎంతో మంది క్షణికావేశంతో తాత్కాలిక నిర్ణయాలతో కుటుంబా లను విచ్ఛిన్నం చేసుకుని తమ పిల్లలకు, కుటుంబ సభ్యులకు తీరని ఆవేదన మిగిల్చుతున్నారు. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే సమస్యల నుండి పలువురు సలహాలు, సూచనలు తీసుకుని బయట పడదాని స్థానికులు పలువురు పేర్కొంటున్నారు.

కలహాలు వుంటే చర్చించి పరిష్కరించుకోవాలి

కుటుంబంలో ఏవైనా సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలి. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోకూడదు. ఈ నిర్ణయం వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయి. పిల్లలు అనాథలవుతారు. సమస్య ఉంటే ఆ సమస్యను ఎదుర్కొని... బయ టకు వచ్చి ఆలోచించాలి. భార్యాభర్తలు ఒకరి నొకరు అర్థం చేసుకోవాలి. వ్యాపార, ఉద్యోగ సమస్యలు, ఒత్తిళ్లు భాగస్వామ్య పై ప్రదర్శించు కోకుండా చూసుకోవాలి. కుటుంబ సభ్యులతో కలిసి ఎక్కువసేపు గడిపేలా ప్లాన్ చేసుకోవాలని పలువురు మానసిక వైద్య నిపుణులు పేర్కొంటు న్నారు.

సమస్యలు ఎదురైతే వీరిని సంప్రదించాలి

కుటుంబాల్లో కలహాలు, వివాదాలను పరిష్కరించు కునేందుకు ఉచిత న్యాయ సేవలు పొందవచ్చు.. జిల్లా కేంద్రం లోని న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా న్యాయ సేవలు పొందే అవకాశం కల్పిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా జిల్లాలో సఖి కేంద్రాలు ఏర్పాటు చేశారు. వారితో మాట్లాడితే సలహాలు, సూచనలు అందిస్తారు. భార్య భర్తలకు కౌన్సెలింగ్ ఇస్తారు. గృహ హింసకు పాల్పడితే శిక్షలు, చట్టాల తదిత రాలపై అవగాహన కల్పిస్తారు.

మనస్పర్థలకు కారణాలు..



పని ఒత్తిడి కారణంగా భాగస్వామితో సమయం కేటాయించ లేకపోవడం, వ్యక్తిగత సమస్యలు, ఒకరిపై మరొకరు అనుమానాలు పెంచుకోవడం, కుటుంబంలో ఆర్థిక సమస్యలు, అనుకోని పరిస్థితులు, అప్పులు పెరిగిపోవడం, వాటిని తీర్చలేక అవ మానంగా భావించి, అసహనం ప్రదర్శించడం, సామాజిక మాధ్యమాలు అతిగా వాడటంతో వివాహేతర సంబంధాలు, సెల్ ఫోన్‌లో మాట్లాడినా, ఇతరులతో మాట్లాడుతున్నా పరస్పర అనుమానాలు పెరగడం, ఒకరినొకరు మధ్య సమస్యలు అర్థం చేసుకోలేకపోవడం వ్యతిరేక ఆలోచనలతో అపార్థలు చేసుకోవడం, ఒకరినొకరు అర్థం చేసుకుని కుటుంబ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలి

- ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు.

ప్రచారం నిర్వహిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఈ నెల 11వ తేదీ చిత్తూరులో నిర్వహించనున్న ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవర కుంట్ల జయరాజ్ పిలుపునిచ్చారు. ఈనెల 11వ తేదీ జిల్లా కేంద్రం చిత్తూరులో నిర్వహించనున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాల్గవ మహాసభలు విజయ వంతం చేయడంలో భాగంగా మంగళవారం వెదరుకుప్పం మండలంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు చల్లా జయ చంద్ర, ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు (చిన్న), కార్యదర్శి యాదవేంద్ర రెడ్డి తదితరులతో కలిసి జయరాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ గంగాధర్ నెల్లూరు అధ్యక్షులు మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి పాటూరు దేవరాజులు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ జరగనున్న ఫెడరేషన్ మహాసభలు విజయవంతం చేయడా నికి జర్నలిస్టులు సమిష్టి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గంగాధర నెల్లూరు నియోజకవర్గం నాయకులు మహేంద్ర, దేవా, జయప్రకాష్, మోహన్ రెడ్డి, చంద్రశేఖర్, విజయ్, ప్రేమ్‌చంద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -వి కోట : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పాకాలకు చెందిన గురుమూర్తి రామకుప్పం మండలం కంచి దాసన పల్లెలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. పండుగ సెలవు కారణం గా స్వగ్రామానికి వెళ్లి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంలో విధులకు హాజర య్యేందుకు వస్తుండగా వి కోట – పలమనేరు ప్రధాన రహదారిలో రాఘవ పల్లి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గాయాలతో పడి ఉన్న ఆ ఉపాధ్యాయుడిని స్థానికులు వికోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్ప టికే అతను మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సహచర ఉపాధ్యాయులు, వారి బంధుమిత్రులకు సమాచారం అందించారు. పోలీసులకు సమాచారం అందించారు.

తాలూకా పోలీస్ స్టేషన్లో చోరీ కేసు నమోదు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుపల్లిలో ఆటో డ్రైవర్ రఫీ ఇంట్లో బంగారు నగలు వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు మంగళవారం తాలూకా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. తాలూకా పోలీసుల కథనం మేరకు ఈనెల 29వ తేదీ ఉదయం అనుపల్లిలో నివాసం ఉంటున్న రఫీ తన ఇంటికి తాళం వేసి పిల్లల్ని భార్యను రంజాన్ సందర్భంగా చిత్తూరుకు తీసుకొచ్చాడు. మంగళవారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళం పగలగొట్టి బంగారు, వెండి తీసుకెళ్లినట్లు గుర్తించిన రఫీ స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఆత్మహత్య చేసుకున్న ఉమ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వివాదాస్పద స్థితిలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు రూరల్ మండలం ఏను గుండ్లపల్లి దళితవాడలో మంగళ వారం చోటు చేసుకుంది. తాలూకా పోలీసుల కథనం మేరకు ..కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్న ఉమ(28) ఆమె ఇంటి పక్కనే శివమణి కాపురం వుంటున్నాడు. శివమణి సెల్‌ఫోన్‌లో ఉమా నెంబర్ ఉండడాన్ని గమనించిన శివమణి భార్య సుజాత శివమణి నెంబర్ తన ఫోన్లో ఎందుకు ఉందని ప్రశ్నించింది. ఇదే విషయాన్ని తన తండ్రి దృష్టికి తీసుకుపోగా సుజాత, ఆమె తండ్రి తన ఫోన్ నెంబర్ శివమణి ఫోన్లో ఎందుకు ఉందని నిలదీశారు. ఈ అవమానాన్ని భరించలేక ఉమ తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తన భార్యను అవమానపరిచి ఆత్మహత్య చేసుకునేలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త రమేష్ తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కోడి పందెం స్థావరాలపై దాడి

11 మంది అరెస్ట్, ముగ్గురు పరారీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కోడి పందెం స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడి చేసి 11 మందిని అరెస్టు చేశామని, ముగ్గురు పరారయ్యారని సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఎగువ కంతల చెరువు పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో కోడి పందేలు ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. 11 మంది అదుపులో తీసుకుని అరెస్ట్ చేశామని ముగ్గురు పరారీలో వున్నారని అదుపులో తీసుకున్న వారి వద్ద వున్న 20వేల 500 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టిడిపి బ్యానర్ల చించివేత

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం పుల్లూరు క్రాస్ లో ఉగాది, రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన టిడిపి బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చించి వేశారు. టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను ఓర్వలేకే గుర్తు తెలియని దుండగులు చింపారని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం అన్నారు. టిడిపి బ్యానర్లను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్ ఆర్ పురం పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, ఏఎంపురం మాజీ సర్పంచ్ మణి, గజేంద్ర, ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ తెలిపారు.



మాట్లాడుతున్న డివి మునిరత్నం

చిరు వ్యాపారుల కడుపు కొట్టొద్దు..

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో కడు నిరుపేదలైన వీధి వ్యాపారుల కడుపు కొట్టొద్దంటూ జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం, జిల్లా యూత్ ప్రెసిడెంట్ సోమరాజు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ప్రస్తుతం రైతు బజారుగా నిర్వహిస్తున్న ప్రాంతంలో వ్యాపారం జరగక, ఆకలి కేకలతో ఉన్న వీధి వ్యాపారులతో మాట్లాడి విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పట్టణంలో అనేకమంది నిరుపేదలు వీధి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే వారని అలాంటి వారిని అధికారులు తమ వ్యక్తిగత గుర్తింపు కోసం వారపు సంత ఆవరణలో వ్యాపారం చేసుకోమనడం బాధా కరమన్నారు. ఒక్కొక్క వ్యాపారి కూరగాయలను ఐదువేలు నుండి పదివేల రూపాయలకు సరుకు కొనుగోలు చేసి ఉదయం నుండి సాయంత్రం వరకు వంద రూపాయలు వ్యాపారం చేయలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటినే నమ్ముకుని బతుకుతున్న వీధి వ్యాపారుల కుటుంబాల్లో చిన్నపిల్లలు, చదువుకునే వారు, పెళ్లీడు వచ్చినవారి భవిష్యత్తు కోసం ఆలోచిస్తున్న తరుణంలో అధికారులు వారిని ఇలా చేయడం వల్ల పిల్లల జీవితం నాశనం అవుతాయన్నారు. పెద్ద పెద్ద వ్యాపారులు రోడ్లు, డ్రైనేజీలు సైతం ఆక్రమించుకొని వ్యాపారం చేసి లక్షలాది రూపాయలు సంపాదిస్తుంటే వారిని వదలి చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఇప్పటికే అక్కడక్కడా వీధి పైనే వ్యాపారం చేసుకుంటున్నారని, మిగిలిన వారిని కూడా యధాతథంగా కొనసాగించాలని కోరారు.

పారిశుధ్యంపై కళాజాతా

పారిశుధ్యంపై కళాజాతా ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పారిశుధ్యం పై కళాజాతా ప్రదర్శనను మంగళవారం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో పంచాయతీ కార్యదర్శి యుగంధర్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి ఉమాదేవి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడి చెత్త, పొడి చెత్త వేరువేరు చేయాలని, పంచాయతీకి ఆదాయ వనరుగా తయార వుతుందని మురికి కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకూడదని, దానివల్ల నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం కళాజాతా బృందం పారిశుద్ధంపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి కళాజాత బృంద సభ్యులు రమణ బాబు , వీరయ్య పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు: ఎంఈవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పదవ తరగతి పరీక్షలు మంగళవారం ముగిసిందని ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మంగళవారం నాలుగు కేంద్రాల్లో 14 మంది విద్యార్థినివిద్యార్థులు గైర్హాజరయ్యారని ఎలాంటి ఆటంకం లేకుండా పదవ తరగతి పరీక్షలు ముగిశాయన్నారు.

పలమనేరు: పలమనేరు మండలం లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా చివరి రోజు సాంఘీక శాస్త్రం పరీక్ష 7 సెంటర్స్‌లలో నిర్వహించారు. ఈ పరీక్ష కు 1377 మంది విద్యార్థుల కు 1367 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రశాంత వాతావరణం లో పదవ తరగతి పరీక్ష లు ముగిశాయని మండల విద్యా శాఖాధికారులు లీలారాణి, బాల సుందరం తెలిపారు.

రొంపిచర్లలో 'పల్లె పండుగ'

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలం పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలో పల్లె పండుగ లో భాగంగా మంగళవారం పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉపాధి హామీ భాగంగా నిర్మించే ఈ నీటి తొట్టెలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం అధ్యక్షుడు సి ఓబులేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, వాటర్ షెడ్ చైర్మన్ అమర్నాథరెడ్డి, ఊటుకూరి మదన్ మోహన్ రెడ్డి, విజయ్ బాబు, వీర పాల్గొన్నారు.

అన్ని విధాలా గ్రామాల అభివృద్ధి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గంగవరం: అని విధాలా గ్రామాల అభివృద్ధి, ఉపాధి హామీ పనులతో అవకాశాలు మెండుగా కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. గంగవరం మండలంలోని కీలపట్ల పంచాయతీ జేఆర్ కొత్తపల్లిలో పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ పనుల్లో పశువులకు నీటి తొట్టెల నిర్మాణ భూమి పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 62 లక్షల రూపాయలతో 187 నీటి తొట్టెలను నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ లో రైతులకు ఎన్నో ఉపయోగకరమైన కార్యక్రమాలు చేసుకునేందుకు అవకాశం ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందని గ్రామాలలో రోడ్లు, మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ రవికుమార్, అసిస్టెంట్ పీడీ ఎస్ రవికుమార్, ఎంపీడీవో సురేష్ కుమార్, తహసిల్దార్ మాధవరాజు, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం హరినాథ్ లతోపాటు టీడీపీ నాయకులు ప్రతాపరెడ్డి, , గిరిధర్ గోపాల్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పురుషోత్తం

విధులు చేపట్టిన ఇన్‌ఛార్జి ఎంపిడివో పురుషోత్తం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పురుషోత్తంను నియ మిస్తున్నట్లు జిల్లా కార్యా లయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన మంగళవారం మీడియాకు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అమరనాథ్ ఉద్యోగోన్నతిపై వెళ్లినట్లు ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం వెలుగు సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపిడివో చంద్రమౌళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలు దరఖాస్తు సమర్పించుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు వారి ఆధార్ నెంబరు, ఫోన్ నెంబర్ జత చేసి ఇవ్వాలని తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లి పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విలువైన వి ద్యా సా మ గ్రి ని పలమనేరు ఎమ్మెల్యే అ మ ర నా థ్ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డితో కలిసి వారి కోడలు ప్రీతికా రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. చిన్నారులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా బొమ్మల రూపంలో రూపొందించిన ఖరీదైన పుస్తకాలను ఆయా అంగన్‌వాడీ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా వారు అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వారిని గ్రామస్థులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమం పెద్దపంజాణి మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి -రొంపిచర్ల: గత నెల మార్చి 25న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని క్రైస్తవ సోదరులు కోరారు. సంఘీభావంగా పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీ క్రైస్ట్ చర్చిలో నిర్వహించిన సమావేశంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి అత్యంత బాధాకరమని కల్లూరు క్రైస్ట్ చర్చి ఫాదర్ ధనరాజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన మృతిపై విచారణ చేపట్టి ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలిపారు.

95 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ: ఎంపీడీవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: 95 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేశామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని 41 పంచాయతీలలో సచివా లయ సిబ్బంది ఉదయం నుండి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి 95 శాతం పూర్తి చేశారని మిగిలిన పింఛన్లను రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

రొంపిచర్లలో ప్రజాదర్బార్

సమస్యలు స్వీకరిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలంలో పుంగనూరు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామ చంద్రారెడ్డి (చల్లా బాబురెడ్డి) వారి స్వగ్రహం లో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి వచ్చిన ప్రతి కార్యకర్తతో ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు సురక్షితం

- ఖర్చు లేని వైద్యం
- డాక్టర్ అరుణకుమార్

ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షితంగా శిశువుకు జన్మనిచ్చిన తల్లి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు సురక్షితమని, ఖర్చులేని వైద్యం అందుతుందని డాక్టర్ అరుణకుమార్ అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన జమ్ము గుండ్లపల్లి గ్రామానికి చెందిన రమాదేవి భర్త గోపాలకృష్ణ తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం సాయంత్రం చేరుకున్నారు. డాక్టర్ అరుణ కుమార్ పరిశీలించి కాన్పు సమయం సమీపించిందని, ఈ రాత్రి అయ్యేలా వుందని తెలిపారు. సురక్షితమైన చికిత్స నిర్వహించడంతో రమాదేవి మంగళ వారం సురక్షితమైన కాన్పుతో మగ శిశువుకు జన్మ నిచ్చింది. శిశువు తండ్రి గోపాలకృష్ణ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణులకు ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు సురక్షితమని, ప్రభుత్వం ఖర్చులేని వైద్యం అందిస్తోందని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విషయం గ్రామాల్లో గర్భిణులకు వివరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత , ఆశ వర్కర్ పాల్గొన్నారు,

డైట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఆధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తు నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. మంగళ వారం కళశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డైట్లో అధ్యాపకులుగా ఎఫ్ఎస్ఎసీ షరత్తులతో డెప్యూటేషన్‌పై పని చేయడానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నామని తెలిపారు. అసక్తి కలిగిన ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్, మేనేజ్‌మెంటు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఆ పాఠశాల హెచ్ఎం లేదా మండల విద్యాశాఖాధికారి వద్ద నుంచి ఆన్‌లైను ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకునే ఉపాధ్యాయులు 31 మార్చి 2025 నాటికి 58 సంవత్సరాలు మించకూడదన్నారు. దరఖాస్తుదా రుడికి కనీసం 5 సంవత్సరాలుపై బడి స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎం, మండల విద్యాశాఖ అధికారిగా అనుభవం కలిగి ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్ట్ లో పోస్టు గ్రాడ్యుయేషన్ కలిగి కనీసం 55 శాతం మార్కులు కచ్చితంగా కలిగి ఉండా లని పేర్కొన్నారు. దరఖాస్తుదారునికి సంబంధిత క్యాడర్‌లో 5 సంవత్సరాలు అనుభవంతో పాటు కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 10 వరకు ఆన్‌లైనులో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10నుంచి 17వ తేదీ వరకు రెండు రోజుల పాటు అర్హత కలిగిన అభ్యర్థులకు రాత పరీక్షలు ఉంటుందని.. రాత పరీక్షల ద్వారా అర్హత సాధించిన వారికి 19వతేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తా మన్నారు. ఇతర వివరాలకు 9505761611 కృపావతి కళాశాల 'సూపరింటెండెంట్, లేదా 8500194152 సెక్షన్ ఆసిస్టెంట్ శ్రీనివాసులును సంప్రదించా లన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకులో డిజిటల్ సేవలు

డిజిటల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న గ్రామీణ బ్యాంకు సిబ్బంది

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డిజిటల్ సేవలపై గ్రామాలలో బ్రాంచ్ మేనేజర్ కృపానంద మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరా లుగా 245 శాఖలతో సప్తగిరి గ్రామీణ బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఖాతా దారులకు సరళమైన అత్యధిక వడ్డీ, అనువైన రుణ సదుపాయం, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ , యూపీఏ డిజిటల్ సేవల ద్వారా లావాదేవీలు నడుస్తున్నాయని దీన్ని ఖాతా దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్షణ అవసరాలకు ఇంటర్‌నెట్ బ్యాంకు సేవలతో వినియోగిం చుకునే అవకాశం కూడా కల్పిస్తున్నామన్నారు. సాధారణ ఖాతాదారులకు 60 సంవత్సరాలకు 7.75 శాతం వర్తించే వడ్డీ, రెండు సంవత్సరాల నుండి మూడు సంవత్సరాల లోపు 7.90 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. 60 ఏళ్లు వున్న సీనియర్ సిటిజన్లకు 8.75 పర్సెంట్, రెండు సంవత్సరాలు నుండి మూడు సంవత్సరాల లోపు 8.90 శాతం వడ్డీ వస్తుందని ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు రైతులు అనేక సందర్భాల్లో ధనవంతుల దగ్గరకు వెళ్లి వారి దగ్గర అధిక వడ్డీకి తెచ్చి నష్టపోతున్నారన్నారు. కొంత మంది రైతులు భూములను ధనవంతులకు అప్పగించాల్సిన పరిస్థితి లేకుండా నేరుగా దగ్గర్లో ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంకులో క్రాఫ్ లోన్లు, గోల్డ్ లోన్లు తక్కువ వడ్డీలకు ఇచ్చే సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, క్యాషియర్ హరినాథ్, ఖాతాదారులు పాల్గొన్నారు.

వైద్య సేవను సద్వినియోగం చేసుకోవాలి

వైద్యాధికారి అనిల్ కుమార్

వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -యాదమరి: 104 ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపు నిచ్చారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దాసరపల్లిలో 104 సంచార వైద్య శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మొదటి మంగళవారం మీ గ్రామానికి ఈ వైద్య వాహనంతో పాటు వైద్య సిబ్బంది హాజరవుతామన్నారు. మీకు దీర్ఘకాలిక వ్యాధులకు నెలకు సరిపడా మందులు, మాత్రలను ఉచితంగా అందించడం, ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ వాహనం వద్దకు వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందాలని డాక్టర్ పిలుపు నిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రా రం భిం చిందని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ప్రజలకు వివరిం చారు. సి హెచ్ ఓ లక్ష్మీనారాయణ మాట్లా డు తూ 14 రకాల వైద్య పరీక్షలు 107 రకాల మందులను ప్రజల అవసరాన్ని అనుగుణంగా అందిస్తామని ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో రాయితీ పనిముట్లు

- ఏవో రాజ్యలక్ష్మి



ప్రజాశక్తి -వికోట : మండలానికి రాయితీ పై వ్యక్తిగత వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో రాజ్యలక్ష్మి తెలిపారు . ప్రభుత్వం రాయితీపై రైతులకు అందించేందుకు బ్యాటరీ స్ప్రేయర్లు 8, పవర్ స్ప్రేయర్లు19, ట్రాక్టర్ మడకలు 24, రోటవేటర్ -1 కేటాయించినట్లు వారు తెలిపారు. వీటిని పొందేందుకు రైతులకు కొన్ని నియమ నిబంధనలు ప్రభుత్వం నిర్దేశించిందని వారు తెలిపారు. చిన్న,సన్నకారు రైతులు గత ఐదు సంవత్సరాలలో రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా పొందని వారు, గత ఆరు సీజన్లలో ఈ పంట నమోదు చేసుకున్న వారు రైతు పరికరాలకు అర్హులన్నారు. ఒక రైతు కుటుంబానికి ఒక్క పరికరమే అందిస్తామని పేర్కొన్నారు. భూసార పరీక్ష చేసుకొని వుండాలని, ట్రాక్టర్ పరికరాలు పొందడానికి ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, రైతు పైన కాని, కుటుంబ సభ్యుల పేర్లపై వుండ చ్చన్నారు. మండల పరిధిలోని ఒక రైతుసేవా కేంద్రానికి ఒక పరికరం, ఒక స్ప్రేయర్ కేటా యించారని తెలిపారు. అర్హులైన ,ఆసక్తి కలిగిన రైతులు ఈనెల 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విధి నిర్వహణలో సమయపాలన పాటించాలి

-డీసీహెచ్ఎస్ ప్రభావతి



రికార్డులు తనిఖీ చేస్తున్న డిసి హెచ్ఎస్ ప్రభావతి

పజాశక్తి కార్వేటినగరం: సిబ్బంది విధి నిర్వహణలో సమయ పాలన తప్పనిసరి పాటించాలని జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసస్ అధికారిణి డాక్టర్ ప్రభావతి అన్నారు. మంగళవారం మండలంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తానున్న వేసవి దృష్యా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా సీహెచ్సీలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రికార్డు లు, పరిశీలించారు. మందుల కొరతలు లేకుండా చూడాలని, అన్ని రకాలైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట డాక్టర్ భాగ్యలక్ష్మి.డాక్టర్ గోపినాథ్, డాక్టర్ శృతీభాగ్యం, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ దివ్య పలువురు ఉన్నారు.

శ్రీకాంత్ రెడ్డి , అనుచరులు టిడిపిలో చేరిక

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: సదుం మండల పరిధిలోని చింతపర్తి వారి పల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చింతపర్తి శ్రీకాంత్ రెడ్డి, పవిత్రా రెడ్డి దంపతులు మండల కన్వీనర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా బాబురెడ్డి సమక్షంలో మంగళవారం టిడిపి కండువాలు కప్పుకున్నారు. చింతపర్తి వారి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గూబలవారిపల్లి బలిజపల్లి, పిడుగోవుల వారి పల్లి, చింతపర్తి వారి పల్లి గ్రామాల పరిధిలో గతంలో వైసిపిలో పని చేసిన వీరి అభిమానులు సుమారు వంద మంది వైసీపీ కార్యకర్తలతో చింతపర్తి శ్రీకాంత్ రెడ్డి దంపతులు టిడిపి పుంగనూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి చల్లా బాబు రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. గతంలో వీరు వైసిపికి క్రియాశీలకంగా పని చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో తమను నమ్ముకున్న కార్యకర్తలు అభిమానులకు న్యాయం చేయలేక పోయామన్న అసంతృప్తితో తన అనుచరులు, కార్యకర్తలతో ఈ సందర్భంగా మండల టిడిపి కన్వీనర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో చింతపర్తి శ్రీకాంత్ రెడ్డి, పవిత్రా రెడ్డి దంపతులు చింతపర్తి వారి పల్లిలో ఆ పార్టీ ఇన్‌ఛార్జి చల్లా బాబు రెడ్డికి పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కలికిరి రోడ్డు నుండి కందూరు రోడ్డు మార్గంలో ఉన్న చింతపర్తి వారి పల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున ఇన్‌ఛార్జికి స్వాగత బ్యానర్లు, టిడిపి జెండాలు ఏర్పాటు చేశారు. క్రేన్ సాయంతో గజమాలతో చల్లా బాబు రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, అమర్నాథ్ గౌడ్, నారాయణ, మునిరెడ్డి, ప్రవీణ్ కుమార్, మనోజ్ కుమార్ రెడ్డి,నారాయణ, హరినాథ్ రెడ్డి, సహదేవ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, చక్రపాణి రెడ్డి, హరినాథ్ రెడ్డి, మహేష్ బాబు తదితర నాయకులు, కార్యకర్తలు అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.